# బలగం BALAGAM TV

ప్రజలే మా బలగం - నిజమే మా బలం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ । శనివారం । 20 జూలై । 2024 | www.balagamtv.com | పేజీలు 1


## మైక్రోసాఫ్ట్ సర్వర్లలో అంతరాయం

### ప్రపంచవ్యాప్తంగా విమాన సంస్థలపై ప్రభావం

**బలగంటీవీ-హైదరాబాద్ బ్యూరో**

మైక్రోసాఫ్ట్‌లో శుక్రవారం తీవ్ర సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా విండోస్‌తో పని చేసే లక్షలాది కంప్యూటర్లు మొరాయించాయి. వాటికవే షట్‌డౌన్ అయిపోయాయి. మళ్లీ ఆన్‌చేయగానే కంప్యూటర్ల స్క్రీన్‌ల మీద 'బ్లూస్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' కనిపించింది. 'మీ పీసీలో సమస్య తలెత్తింది. రీస్టార్ట్ చేయండి' అనే సందేశం స్క్రీన్‌పై దర్శనమిచ్చింది. అయితే, ఎన్నిసార్లు రీస్టార్ట్ చేసినా ఇదే సమస్య పునరావృతమైంది. దీంతో అనేక దేశాల్లో ఇంటర్నెట్ ద్వారా పని చేసే వ్యవస్థలన్నీ స్తంభించిపోయాయి.

ఇక బ్యాంకింగ్, విమానయాన, ఐటీ సేవల్లో తీవ్ర అంతరాయం కలిగింది. కొన్ని విమానాలు రద్దయ్యాయి. ఇంకొన్ని ఆలస్యమయ్యాయి. కొన్ని చోట్ల ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సైతం నిలిచిపోయాయి. దీంతో అంతటా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విండోస్ 10, 11 ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ప్రధానంగా సమస్య తలెత్తింది. విండోస్ 7 ఓఎస్‌తో నడిచే సిస్టమ్‌లు యథావిధిగా పని చేశాయి. అనేక గంటల పాటు శ్రమించిన నిపుణులు చివరకు సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు. కంప్యూటర్లు మళ్లీ ఎలా ఆన్ చేయాలో వినియోగదారులకు మైక్రోసాఫ్ట్ సూచనలు చేసింది.

## విద్యా వ్యవస్థలో సరికొత్త విధానం

- 3వ తరగతి వరకు అంగన్ వాడీల్లోనే ప్లేస్కూల్ తరహా బోధన
- 4 నుంచి సెమీ రెసిడెన్షియల్స్..
- విద్యార్థులకు రవాణా సదుపాయం
- విద్యావేత్తలతో చర్చించి ప్రణాళికలు రూపొందిచాలని విద్యాశాఖకు ముఖ్యమంత్రి ఆదేశాలు



**బలగంటీవీ-హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను, విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా సరికొత్త విధానంతో ముందుకు వెళ్లాలని విద్యా శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులకు సీఎం సూచించారు.

ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ కు సమాంతరంగా అన్ని చోట్లా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారితో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ పై విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం ఈ మేరకు సూచనలు చేశారు.

**అంగన్ వాడీలకు సింగిల్ టీచర్**

చిన్న పిల్లలకు సొంత గ్రామాల్లోనే సౌకర్యవంతంగా ఉండేలా ప్లే స్కూల్ తరహాలో 3వ తరగతి వరకు అంగన్ వాడీ కేంద్రాల లోనే విద్యాబోధన చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంగన్ వాడీలలో ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా విద్యా బోధన కోసం ప్రత్యేకంగా ఒక టీచర్ నియమించేలా ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు.

**రెసిడెన్షియల్స్ కు రవాణా సదుపాయం**

3వ తరగతి వరకు అంగన్ వాడీ ప్లే స్కూల్ లో బోధన తర్వాత విద్యార్థులు 4వతరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుకునేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కు వెళ్లివచ్చేందుకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా చూడాలని సీఎం సూచించారు.

**విద్యావేత్తలతో చర్చించాక పైలట్ ప్రాజెక్టు**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ప్లే స్కూల్, సెమీ రెసిడెన్షియల్ విధానాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయడానికంటే ముందే విద్యా వేత్తల అభిప్రాయాలు తీసుకోవాలని విద్యా శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యావేత్తల సూచనలను బట్టి ముందుగా ఒకట్రెండు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టేలా ప్రణాళికలు ఉండాలని సీఎం చెప్పారు.

**సీఎస్ఆర్ ఫండ్స్ తోనూ..**

పాఠశాల్లో వసతులు, సౌకర్యాల పెంపు కోసం ప్రభుత్వ నిధుల తోపాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ( సీఎస్ఆర్) ఫండ్స్ పైనా దృష్టి సారించాలని అధికారులకు సీఎం సూచించారు. వీటితో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవసర మైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## చారాణ కోడికి.. బారాణ మసాలా..!

### కాంగ్రెస్ రుణమాఫీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు



**బలగంటీవీ-హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయాల వరకు రుణమాఫీ చేసినట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దీనిపై ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ సర్కార్ పంటల రుణమాఫీ చూస్తుంటే చారాణ కోడికి.. బారాణ మసాలా.. అనే సామెత గుర్తుకు వస్తుందని కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీ అయిన రైతుల కన్నా.. కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయనిపేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలు అయ్యాయని తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు రుణమాఫీ కాక అంతులేని ఆందోళనలో ఉన్న సమయంలో ఈ సంబురాలు ఎందుకు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. మభ్యపెట్టే మీ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇంతకాలం.. అటెన్షన్ డైవర్షన్..! ఇప్పుడేమో.. ఫండ్స్ డైవర్షన్..!! అంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు.

## కేసీఆర్ హయాంలో రైతులకు రూ. 1,20,005 కోట్ల సాయం

### మాజీ మంత్రి హరీశ్‌రావు



**బలగంటీవీ-వెబ్ బ్యూరో**

మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. కేసీఆర్ హయాంలో సాగుకు స్వర్ణయుగం.. లక్ష కోట్లకు పైగా సంక్షేమం జరిగిందని తెలిపారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతన్నకు నేరుగా లక్షల కోట్ల రూపాయాల ఆర్థిక సాయాన్ని అందించినట్టు పేర్కొన్నారు. రైతుభంధు పథకం కింద 69 లక్షల మంది రైతులకు రూ. 72,972 కోట్లు అందించారని... 11 వేల మంది రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ. 6,488 కోట్లు అందజేశారని తెలిపారు. రెండు దఫాల్లో రూ. 29,144.61 కోట్ల రుణమాఫీ చేశారు. ఇతర రైతు సంక్షేమ పథకాల కింద రూ.11.401 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. కేవలం ఈ పథకాల ద్వారానే రైతులకు అందిన ఆర్థిక సాయం రూ. 1,20,005 కోట్లు.. దేశ చరిత్రలో ఇది ఆల్ టైం రికార్డ్ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు



- విద్యావేత్తలతో భేటీలో ముఖ్యమంత్రి

**బలగంటీవీ-హైదరాబాద్ బ్యూరో**

అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు నాణ్యమైన విద్యా బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్య తనిస్తున్న ప్రభుత్వం గతంలో ప్రతిపాదించినట్టుగా త్వరలోనే విద్యా కమిషన్, వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావులతో కలిసి సచివాలయంలో విద్యావేత్తలు ప్రొ.హరగోపాల్, ప్రొ. కోదండరాం, ప్రొ.శాంతా సిన్హా ప్రొ.అల్దాస్ జానయ్య, ప్రొ.పద్మజా షా, ప్రొ.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలోని పలు సమస్యలు, అంశాలను వారు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

విద్యా రంగం బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న పలు విషయాలను సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించామని, అంగన్ వాడీలను ప్లే స్కూల్ తరహాలో మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ జారీ, ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహణ, పాఠశాలలు తెరిచిన రోజే పిల్లలందరికీ యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల అందజేత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన వంటి చర్యలను వివరించారు. విద్యా రంగం బలోపేతానికి మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ లతో ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలో చేపట్టాల్సిన మార్పులపై విధాన పత్రం రూపొందించి వాటిపై సబ్ కమిటీతోనూ చర్చించాలని వారికి సూచించారు.

## గ్రూప్ 2 పరీక్ష వాయిదా




**బలగంటీవీ-హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో తెలంగాణ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ 2 పరీక్ష ప్రభుత్వం స్త్రీ వాయిదా వేసింది. ఈ వేరకు టీజీపీఎస్సీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. డిసెంబర్ లో పరీక్షలు నిర్వహిస్తామని బోర్డు స్పష్టంచేసింది. పరీక్షల తేదీలో త్వరలో ప్రకటిస్తామని క్లారిటీ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్ట్ 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష జరగాలి. అయితే గ్రూప్-2 పరీక్ష సమయంలో ఇతర పరీక్షలు ఉండటంతో వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని నిరుద్యోగులుకోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం గ్రూప్-2 వాయిదా వేయాలని నిర్ణయించింది. గత కొన్ని రోజులుగా డీఎస్సీ పరీక్షలు కూడా అదే సమయంలో ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన చేస్తుండగా ప్రభుత్వ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నోటిఫికేషన్ 2022 డిసెంబర్ లో 783 పోస్టులతో విడుదలైంది. పలు కారణాల వల్ల ఇప్పటి దాకా మూడు సార్లు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా పడింది. 5.51 లక్షల అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

## అట్టుడుకుతున్న బంగ్లాదేశ్

### ఆందోళనలు, నిరసనలు.... 32 మంది మృతి




**బలగంటీవీ-ఢాకా**

బంగ్లాదేశ్ ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల కోటా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. రిజర్వేషన్లు రద్దు చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. ఆందోళనకారుల్లో ఏడుగురు హత్యకు గురవడంతో హింస చెలరేగింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ నిరసనలలో ఇప్పటి వరకు 32 మంది చనిపోయారు. గురువారం ఒక్కరోజే 25 మంది మృత్యువాత పడ్డారు. మరో 2,500 మందికి పైగా గాయపడ్డారు.

**ప్రధాని సందేశం ప్రసారం చేశారని ఆందోళనలు**

ఆందోళన నేపథ్యంలో శాంతియుతంగా ఉండాలంటూ నిరసనకారులను ఉద్దేశించి బంగ్లా ప్రధాని షేక్ హసీనా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంస్థ బీటీవీ ప్రధాని వీడియో సందేశాన్ని ప్రసారం చేసింది. దీనిపై మండిపడ్డ నిరసనకారులు గురువారం ఢాకాలోని బీటీవీ హెడ్డాఫీసు ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులపైకి పోలీసులు రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు బీటీవీ ఆఫీసులోకి చొచ్చుకెళ్లి ఫ్రంట్ ఆఫీసుకు నిప్పంటించారు. ప్రధాన ద్వారం వద్ద మంటలు చెలరేగడంతో చాలామంది ఉద్యోగులు లోపలే చిక్కుకుపోయారని బీటీవీ తెలిపింది. అయితే, ఆ తర్వాత కాసేపటికే రెస్క్యూ సిబ్బంది సాయంతో అందరినీ క్షేమంగా బయటకు తీసుకు వచ్చినట్లు ప్రకటించింది.

ఆఫీసు పార్కింగ్ ప్లేస్ లోని పలు వాహనాలకు నిరసనకారులు నిప్పుపెట్టారని వివరించింది. ఈ ఘటనలో పలు పరికరాలకు నిప్పంటుకోవడంతో బీటీవీ ప్రసారాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. హత్యకు గురైన నిరసనకారుడికి న్యాయం జరగాలని, ప్రధాని హసీనా క్షమాపణ చెప్పాలని విద్యార్థులు పట్టుబడుతున్నారు. ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని నిలుపుదల చేసింది.

## కిడ్నీ రాకెట్ గుట్టురట్టు

**బలగంటీవీ-న్యూఢిల్లీ**

ఐదు రాష్ట్రాల్లో కిడ్నీలు అమ్ముతున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఒక మహిళా డాక్టర్‌తో సహా ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ముగ్గురు బంగ్లాదేశ్ జాతీయులని పోలీసులు తెలిపారు. ఢిల్లీలోని జసోలా విహార్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన కొంత మంది అనుమానాస్పద కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రైడ్ చేయడంతో కిడ్నీ రాకెట్ విషయం వెలుగులోకి వచ్చింది. రస్సెల్, రోకాన్, సుమోన్ మియాన్, రతేష్ పాల్ అనే నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, అరెస్ట్ చేసిన వారిని ప్రశ్నించగా నిరుపేదల కిడ్నీల కోసం ఈ ముఠా రూ.4 నుంచి రూ.5 లక్షలు చెల్లిస్తున్నట్టు తెలుసుకున్నారు. కొన్నిసార్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎరగా వేసినట్లు చెప్పారు.

## పెద్దవాగుకు గండి



- 250 మీటర్ల పొడవున గండి
- నీట మునిగిన గ్రామాలు
- వరదలో కొట్టుకుపోయిన పశువులు

**బలగంటీవీ-హైదరాబాద్ బ్యూరో**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అశ్వారావుపేట మండలంలో ఉన్న పెద్దవాగుకు భారీ గండి పడింది.ప్రాజెక్టుకు సామర్థ్యానికి మించి నీరు రావడంతో ప్రాజెక్టు కట్టకు గండి ఏర్పడింది. గురువారం రాత్రంతా నీరు దిగువకు వెళ్లడంతో ప్రాజెక్టు ఖాళీఅయింది. ఈ గండి కారణంగా అనేక పల్లెలు నీటమునిగాయి. దిగువన అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కోయరంగాపురం, కొత్తూరు, రమణక్కపేట గ్రామాలకు పాక్షికంగా నష్టం జరగ్గా ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం, ఒంటిబండ, కోయమాదారం, కొత్తపూచిరాల, పాతపూచిరాల, అల్లూరినగర్, సొందిగొల్లగూడెం, వసంతవాడ, గుళ్లవాయి, వేలేరుపాడు గ్రామాలకు భారీగా నష్టం సంభవించింది. వరద ప్రవాహానికి వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నది.

పెద్దవాగుకు 250 మీటర్ల పొడవున గండి పడగా ఇక వరదలో వందలాది పశువులు కొట్టుకు పోయాయి. పలు గ్రామాలకు భారీగా నష్టం సంభవించింది.

సహాయక చర్యలు చేపట్టేందుకు వరద ప్రభావిత ప్రాంతాలకు అధికారులు చేరుకునే పరిస్థితి లేకుండా పోయింది. వారంతా వేలేరుపాడులోనే ఉండిపోయారు. దాదాపు 2000 కుటుంబాలు ఎవరి దారిన వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకుంటున్నట్టు సమాచారం. గురువారం ఉదయం నుంచి విద్యుత్తు సరఫరా కూడా లేకపోవడంతో సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. ప్రాజెక్టు కట్ట తెగడంతో వేల ఎకరాల్లో పంట నాశనమైంది. మరోవైపు వందల సంఖ్యలో పశువులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తయిన భవనాల్లో రాత్రంతా తలదాచుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక పరుగులు తీశారు. గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో సహాయక చర్యలకు వీలు లేకుండా పోయింది.